క్లుప్తంగా

దీపావళి కొత్త వెలుగులు నింపాలి



నందిగామరూరల్/జగ్గయ్యపేటఅర్బన్ : దీపావళి పండుగ ప్రతిఒక్కరి జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్, నందిగామ మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు వారు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై విజయానికి గుర్తుగా దీపావళి పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలన్నారు. శాంతి, మతసామరస్యం, నవసమాజ నిర్మాణానికి ఈపండుగ నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దీపావళి పండుగలో భాగమైన బాణాసంచా కాల్చే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు.

వైభవంగా పాంచాయతన యాగం



పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు అవతల కెల్ ఫంక్షన్ హాల్‌లో రెండురోజులుగా హైదరాబాద్‌కు చెందిన ఈమని ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాంచాయతన యాగం వైభవంగా సాగుతోంది. కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక అభిషేకాలతో పాటు సాయంత్రం యాగాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం 40 మందికి పైగా రుత్వికులతో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సూర్యుడు, గణనాథుడు, అమ్మవారు, శివుడు, విష్ణుమూర్తికి సంబంధించి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అందరికీ సకల సుఖాలు కలగాలని యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



నందిగామరూరల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సొసైటీ చైర్మన్ గాడిపర్తి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గోళ్లమూడి గ్రామంలోని సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించి వారిని ఆదుకునేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు

విద్యుదాఘాతంతో మూడు గొర్రెలు మృతి



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): విద్యుదాఘాతంతో మూడు గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని అనిగండ్లపాడులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కామసాని రామకృష్ణకు చెందిన గొర్రెలు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. ఎర్త్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై గొర్రెలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు. ఈ ఘటనతో రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు.

సిలిండర్ లీకై మంటలు



కంచికచర్ల: బేకరీలో గ్యాస్ సిలిండర్ పైప్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగిసిపడిన సంఘటన కంచికచర్లలో ఆదివారం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది కథనం మేరకు..స్థానిక అంబేడ్కర్ సెంటర్ సమీపంలో బెంగుళూరు అయ్యంగారి బేకరీలో గ్యాస్ సిలిండర్ పైపు లీకై మంటలు చెలరేగాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. దీంతో పెద్దప్రమాదమే తప్పిందని బేకరీ సిబ్బంది, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనలో సిలిండర్ పైప్‌తోపాటు రెగ్యులేటర్ పూర్తిగా కాలిపోయిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి రథోత్సవం



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ నిర్వహించిన అమ్మవారి రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో వాహనాల రద్దీ కొనసాగింది.



ఆలయం బయట భక్తుల సందడి



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



అమ్మవారి నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా నాయకులు సుందరయ్య

జగ్గయ్యపేటఅర్బన్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను రాష్ట్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధానకార్యదర్శి సుందరయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని టీచర్స్ కోపరేటివ్ సొసైటీ భవన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సుందరయ్య, ఏపీ ఎన్జీవో నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, బొమ్మి వెంకట్రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ అణచివేత ధోరణికి సచివాలయ ఉద్యోగుల అనైక్యతే కారణమన్నారు. సచివాలయ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి పోరాడితే ఆయా సమస్యల పరిష్కారమవుతాయన్నారు. ఇంటింటి సర్వే విధుల నుంచి సచివాలయ ఉద్యోగులను తప్పించాలని, వారికి జూనియర్ అసిస్టెంట్ పే స్కేలు ఇవ్వాలని, స్పష్టమైన పదోన్నతులు, రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ కోసం నియోజకవర్గస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో ఎన్జీవో నాయకులు విజయకుమార్(హెల్త్), యూటీఎఫ్ నాయకులు సుధానంద్, అల్లిక నరసింహారావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ముసునూరు: ముసునూరు హైస్కూల్ 2004–2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తుక్కులూరు వద్ధాశ్రమంలో 100 మంది వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. ముసునూరు హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు ప్రతి నెలా మూడో ఆదివారం వృద్ధులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని భోజనం ఏర్పాటు చేస్తున్నామని, ఐదో నెల పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తొర్లపాటి శ్రీనివాసరావు, మద్దాల ఆంబ్రోస్, పల్లెపాము నవీన్, నల్లిబోయిన నాగరాజు, కూకటి రాజేష్, జంగం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్‌లతో తీవ్రనష్టాలు : సీపీఎం



నందిగామ గాంధీ సెంటరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

నందిగామరూరల్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారత్‌తో సహా ప్రపంచదేశాలన్నింటిపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కోట కళ్యాణ్ ఆందోళన వ్యక్తంచేశారు.

సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీసెంటరులో అమెరికా ట్రంప్ టారిఫ్ సుంకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్‌లు భారత్‌లోని వ్యవసాయరంగంతో పాటు పారిశ్రామికోత్పత్తి, సేవారంగాలను దెబ్బతీసిందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, పట్టు తదితర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు.

ఉద్యోగులు, కార్మికులతోపాటు రైతులు కూడా రోడ్డున పడే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో దేశ ప్రయోజనాలను కాపాడుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను అందిపుచ్చుకోవలసిన కేంద్రప్రభుత్వం అందుకు విరుద్ధంగా ట్రంప్ అడుగులకు మడుగులొత్తుతూ లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తోందని ఆగ్రహం వక్తం చేశారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయకుండా మిన్నకుండిపోతుందని మండిపడ్డారు. ఇకనైనా కేంద్రం స్పందించి ఆయా రంగాలు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కటారపు గోపాల్, సయ్యద్ ఖాశీం, కరి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, లాజర్ పాల్గొన్నారు.

వెలవెలబోతున్న బాణసంచా దుకాణాలు

నష్టాలు తప్పేలాలేవని వ్యాపారుల ఆందోళన



నందిగామలో కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న బాణసంచా దుకాణాలు

నందిగామరూరల్: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాలు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. శనివారం రాత్రి వర్షపడటంతో వ్యాపారులను ఆందోళనకు గురిచేసింది.బాణసంచా విక్రయాలు ఆదివారం కూడా అరకొరగానే సాగాయని వ్యాపారులు చెబుతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి దుకాణాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో సోమవారం వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

ఆఫర్‌లు ప్రకటించినా...

బాణసంచా విక్రయాల్లో ప్రజలను ఆకర్షించేందుకు దుకాణాదారులు పలురకాల ఆఫర్లు ప్రకటిస్తున్నారు.

ముఖ్యంగా గతంలో ఎన్నడూలేని విధంగా కేజీ సేల్‌ను సైతం ప్రారంభించడం గమనార్హం. లక్ష్మీ ఓట్స్, చిచ్చుబుడ్లు, భూచక్రాలు తదితర టపాసులను సరసమైన ధరలకు విక్రయిస్తుండటంతోపాటు ఆఫర్లు సైతం ప్రకటించినప్పటికీ ఆశించిన స్థాయిలో వ్యాపారం సాగడం లేదని దుకాణదారులు చెబుతున్నారు.

కాగా గతేడాదితో పోల్చితే ఈ ఏడాది బాణసంచా ధరలు ఒకింత అధికంగానే ఉన్నాయనే చర్చ పట్టణవాసుల్లో సాగుతోంది.

పెట్టుబడులైనా వస్తాయో? లేదో?..

బాణసంచా విక్రయాలకు అధికారులు రెండురోజులు సమయం ఇవ్వగా, ఆదివారం పెద్దగా విక్రయాలు సాగలేదు. ఇక పండుగరోజైనా సోమవారం సాగే బాణసంచా విక్రయాలపైనే వ్యాపారుల లాభనష్టాలు ఆధారపడి ఉన్నాయి. పండుగ రోజైనా వినియోగదారులు ఆసక్తి చూపకపోతే వెలుగుల పండుగ దీపావళి తమకు చీకటిరోజును మిగుల్చుతుందేమోనని వ్యాపారులు ఆందోళన చెందుతుండటం గమనార్హం.

కళ తప్పిన దీపావళి..

గతంతో పోల్చితే ఈ ఏడాది దీపావళి పండుగ కళ తప్పిందనే చెప్పవచ్చు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతినడంతో అన్నదాతలు నష్టాల పాలయ్యారు. వ్యవసాయ పనులు లేకపోవడంతోపాటు రోజురోజుకు పెరుగుతున్న ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు చవి చూస్తుండటం కూడా పండుగ కళ తప్పడానికి మరో కారణం. దీనికి తోడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం అరకొరగానే అందుతుండటంతో చేతిలో చిల్లిగవ్వ లేక సింహభాగం ప్రజలు పండుగను జరుపుకోలేక మిన్నకుండిపోతుండటంతో ఈ ఏడాది దీపావళి పండుగ కళ తప్పిందనే వ్యాఖ్యలు నియోజకవర్గ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



నందిగామటౌన్: జాతీయ ప్రతిభా పాటవ పరీక్షలో (ఎన్ఎంఎంఎస్) విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా కృషి చేస్తున్నట్లు నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి తెలిపారు.

పాఠశాలలోని తొమ్మిది, పది, ఇంటర్ చదువుతున్న 30 మంది విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆదివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు సంబంధించిన 120 పేజీల స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేల చొప్పున రెండేళ్లు స్కాలర్‌షిప్ అందుతుందని వివరించారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని స్కాలర్‌షిప్‌ను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జక్కనాచార్యులు, ఆరుద్ర కొండ, ఒట్టికొండ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపాల మహోత్సవం





దీపాల మహోత్సవంలో పాల్గొన్న తన్నీరు సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్:దీపావళి పర్వదినం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక విజ్ఞాన్ హైస్కూల్లో దీపాల మహోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణ మొత్తం దీపాల వెలుగులో కాంతులీనగా, బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు చిచ్చుబుడ్లు, టపాకాయలు కాల్చారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి



పేటలో సాగుతున్న ప్రమిదల విక్రయాలు

జగ్గయ్యపేటఅర్బన్: బాణసంచా విక్రయ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణ ఎస్ఐలు జి.రాజు, శంకర్‌లతో కలిసి ఆదివారం ఆయన బాణసంచా విక్రయ దుకాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ దీపావళి మందుల దుకాణదారులు తమ షాపుల వద్ద అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రతి దుకాణం వద్ద కెమికల్ గ్యాస్, ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఫైర్ సర్వీస్, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలసి ఆయా దుకాణాల వద్ద భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎస్ఐలను ఆదేశించారు.

దీపావళి సందడి..

పట్టణంలోని పలు కూడళ్లలో ప్రమిదలు విక్రయించే దుకాణాలు రద్దీగా మారాయి. ప్రమిదలు విక్రయించే తోపుడుబండ్ల వద్ద పట్టణ ప్రజలు ప్రమిదలు కొనుగోలు చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: ఆశీష్ స్టూడియోస్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో ఆదివారం రాగలహరి సంగీత సంస్థ సహకారంతో సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశీష్ స్టూడియోస్ అధినేత సత్యస్వాతి మాట్లాడుతూ.. కళాకారుల ప్రదర్శన కోసం స్టూడియోస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విలువలతో కూడిన కార్యక్రమాలకు అవకాశం ఇస్తున్నామన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. ఆశీష్ స్టూడియో నిర్వహించే కార్యక్రమాలను చింతకాయల చిట్టిబాబు, ఆదిరాల జయప్రభు, బాలాజీకుమార్, శ్యాంప్రసాద్ అభినందించారు.

మూడు దుకాణాలకే అనుమతులు

పెనుగంచిప్రోలు: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ ఎ శాంతిలక్ష్మి ఆదివారం హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా పెనుగంచిప్రోలులో తాత్కాలికంగా బాణసంచా అమ్ముకోవటానికి మూడు దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల వద్ద తీసుకున్న భద్రతా చర్యల్లో లోపాలు ఉన్నట్లయితే సెల్ నంబరు 91549 70454కు ఫోన్‌చేసి తెలియజేయాలని తహసీల్దార్ కోరారు.

సూపర్‌స్టార్ కృష్ణకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించాలి



జ్ఞాపికలతో కృష్ణ అభిమానులను సత్కరించిన సుధాస్వామి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీనటుడు, సూపర్ స్టార్ కృష్ణకు కేంద్ర ప్రభుత్వం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించాలని ఆయన అభిమానులు డిమాండ్ చేశారు. అవార్డు ప్రకటించాలని కోరుతూ ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీసాయిబాబా, నాగమానసాదేవి ఆలయంలో కృష్ణ అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అభిమానులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలిండియా సూపర్ స్టార్ కృష్ణ-మహేష్ బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి మాట్లాడుతూ.. కృష్ణ నటుడిగా, నిర్మాతగా తెలుగు చలన చిత్ర పరిశ్రమకు కొత్త సొబగులు అద్దారన్నారు. కోట్లాది మంది అభిమానుల అభిమానాన్ని చూరగొన్న కృష్ణకు కేంద్ర ప్రభుత్వం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం సముచితమన్నారు. ఆ దిశగా కేంద్రం ఆలోచన చేయాలని కోరారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అనంతరం కృష్ణ అభిమానులను సత్కరించి, వారికి జ్ఞాపికలు అందజేశారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 70 సంవత్సరాలు దాటిన నిరుపేద వృద్ధులు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ తెలిపారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము దాతలు, ట్రస్టీల సహకారంతో 211 నెలలుగా వృద్ధులకు ప్రతీ నెలా నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. వృద్ధులకు అన్ని విషయాల్లో అండగా ఉండి వారి జీవన ప్రమాణం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో వృద్ధాప్యం అనేది ఒక భాగమని, ఎవరికి వారు తమ వంతు బాధ్యతగా వృద్ధులను ఆదరించాలని సూచించారు. తాము చేస్తున్న సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిత్యావసర సరుకులు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు, మధుసూదనరావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.